# గండు చీమలు

అయిదో కథ పూర్తయ్యేక అయిదో కొబ్బరికాయ కొట్టింది శ్యామల. మాధవరావుకి కొబ్బరికాయ కొట్టే ఓపిక కూడా లేదు. సత్యన్నారాయణ వ్రతం ముగిసింది.

'ఓసారి లేచి చేతులు జోడించి ఆత్మప్రదక్షిణం చేసుకోండి" అన్నాడు పంతులుగారు.

నిద్రవచ్చి రెప్పల మీద పొరాడుతోంది. బలవంతంగా కళ్ళు తెరిచి, అప్పటికే నిద్రలో జోగుతున్న మాధవరావు భుజం మీద మెల్లగా తట్టింది శ్యామల. ఆయన ఉలిక్కిపడి చూశాడు.

పంతులుగారు పళ్ళుకన్పించేలా నవ్వి "ఓసారి లేచి చేతులు జోడించి ఆత్మ ప్రదక్షిణం...' అన్నాడు మళ్ళీ. తెల్లవారుఝాము నుంచి పీటమీద కూర్చుని కూర్చుని పట్టుకుపోయిన కాళ్ళని నెమ్మదిగా సవరించుకుని మోకాళ్ళ మీద చేతులేసుకుని అతికష్టం మీద లేచి నిల్చున్నాడు మాధవరావు. అంతకు ముందే లేచి నిల్చున్న శ్యామల కొబ్బరికాయ కొట్టినప్పుడు చీరుకుపోయిన అరచేతికి వేళ్ళు ముడిచి పళ్ళ బిగువున నొప్పిని అదిమిపట్టింది.

తెల్లవారుఝామున రెండున్నర గంటలకి గృహప్రవేశ ముహూర్తం. రాత్రంతా నిద్రలేదు. ఆ పూజ ముగిసిన వెంటనే సత్యనారాయణ వ్రతం ప్రారంభించేశాడు పంతులుగారు. అలా చేస్తేనే గృహ ప్రవేశం శుభప్రదం, జయప్రదం అవుతుంది అన్నాడు. సరే కానిమ్మని అన్నీ సిద్ధం చేసుకున్నాక తెలతెలవారే వేళ "ఇప్పుడే క్షణంలో చక్కా వస్తాను" అంటూ వెళ్ళిన పంతులు ఓ గంట పోయేక స్థిమితంగా వచ్చాడు. ఈ లోపల ఒకటి కెళ్ళాల్సొచ్చి కడుపుబ్బి పోతున్నా పీటల మీంచి లేవొచ్చో లేదో తెలీదు.

అసలే రెండు రోజులు ఊరంతా కాలినడకన తిరిగి తెలిసిన వాళ్ళందర్నీ పిలిచేసరికి సగం ఓపికలైపోయి నీరసం వచ్చింది. ఇంకా బైటి ఊళ్ళకి కార్డులుపోస్టులో వేసెయ్యబట్టి సరిపోయింది.

ముందసలు కోడలు నీరజ వచ్చేక పిలుపుల కెళ్దాం అనుకుంది శ్యామల. సెలవు లేదని, ముందు రోజుకి వస్తామని ఫోన్ చేశాడు రాఘవ. అన్నట్టుగానే నిన్న ఉదయం గౌతమీలో దిగారు.

ప్రదక్షిణం చేస్తున్న మాధవరావు ఒళ్ళు జోగినట్టయి తూలి పడబోయాడు. పక్కనున్న వాళ్ళెవరో గమ్మున పట్టుకున్నారు. శ్యామలకి నిద్ర ఎగిరిపోయి కళ్ళు పెద్దవి చేసి చూస్తూ నిలబడిపోయింది. హారతిచ్చేటప్పుడైనా నీరజ వస్తుందేమోనని చూసింది. దరిదాపుల్లో ఎక్కడా నీరజ జాడ కనిపించలేదు.

సంభావనలు, ఆశీర్వాదాలు అవుతున్నాయి.

శ్యామల మనసెక్కడికో పరుగెత్తింది -

ఈ ఇల్లు కట్టడం మొదలుపెట్టి ఆరునెలలయింది. అప్పట్నుంచి వేళకి తిండిలేదు, నిద్రలేదు. ఎండనకా కొండనకా సిమెంటనీ, ఇసకనీ దేనికో దానికి పరుగులెత్తాల్సి వచ్చేది. అరవై దాటిన ఈ వయసులో ఇంటి పని మాధవరావుని సగానికి సగం చేసింది. ఓ సందర్భంలో చెమటలు కక్కుతూ కళ్ళు తిరిగి పడిపోయాడు. పది రోజులు హాస్పిటల్లో ఉండాల్సి వచ్చింది. దగ్గర్లోని బస్తీలో గుండెకు సంబంధించిన పరీక్షలన్నీ చేశారు.

చూడ్డానికొచ్చిన రాఘవ చాలా అసహనం ప్రదర్శించేడు.

"ఎండలో నడిచెవడు తిరగమన్నాడు? ఏ రిక్షానో ఎక్కితే ఏమైంది? ఇప్పుడు చూడు వేలకి వేలు బిల్లు వదులుతోంది. అసలే ఐరనూ, మార్బులూ ధర పెరిగిపోయి ఇంటి ఖర్చు ఎస్టిమేషన్ దాటిపోయింది. పెట్టినలోను ఏ మూలకీ రాక బుర్ర తిరిగిపోతోంది. హాయిగా హైదరాబాద్‌లో మాతోబాటు ఉండమంటే ఉన్న ఊళ్ళో ఇల్లో అని నా ప్రాణం తీశారు. అదైనా తొందర తొందరగా కట్టిస్తారనుకుంటే ఇదిగో ఇలాగ...' అని విసుక్కున్నాడు.

"అవునా... హైదరాబాద్‌లో వాళ్ళతో బాటు ఉండమన్నారా?..." అని ఆశ్చర్యపోయింది శ్యామల.

అంత ఖర్చు పెడుతున్న వాడికి ఆ మాత్రం అసహనం సహజమే అని సర్దిచెప్పుకున్నాడు మాధవరావు.

సొంత ఇల్లు అనేది తలమీదికి ఓ గూడులాగైనా నిర్మించుకోవాలని ఇటీవలి కల వాళ్ళిద్దరికీ. అలాంటిది, అన్ని హంగుల్తో, పాలరాయి గచ్చుతో, తిప్పితే నీళ్ళొచ్చే కుళాయిల్తో స్వప్నసౌధం తయారవుతుంటే, దాని కోసం లక్షలు ఖర్చు పెడుతున్న కొడుకు విసుక్కున్నా, కసురుకున్నా సంతోషమే. ఇంత మంచి ఇల్లు కట్టుకోగలమని ఏనాడైనా ఊహల్లోనైనా అనుకున్నారా?

నలభై ఏళ్ళ క్రితం తండ్రి అప్పగించిపోయిన బాధ్యతల్ని నెత్తికెత్తుకున్నాడు. మాధవరావు. అమ్మాయైనా, అబ్బాయైనా ఒక్క బిడ్డ చాలనుకున్నాడు. రాఘవని పెంచడం,

చదివించడం అంతా ప్లాన్ ప్రకారమే జరిగింది. కాని సొంత భూమి రెండెకరాల మెట్ట, కౌలుకి తీసుకున్న అయిదెకరాల మాగాణి మీద వచ్చే కొద్దిపాటి ఆదాయంతో రాఘవని పెద్ద చదువులు చదివించడానికి చాలా త్యాగాలే చెయ్యాల్సి వచ్చింది. ఓ సందర్భంలో డబ్బు చాలక తాతలనాటి పాత ఇంటిని అమ్మాల్సి వచ్చింది. కోరుకున్న తిండి బట్ట కొడుక్కి సమకూర్చి, కనీస అవసరాల్ని కూడా త్యాగం చేసిన రోజులున్నాయి. అయినా అప్పులయ్యాయి.

రాఘవ స్వతహాగా తెలివైన వాడు. కరెక్ట్ టైంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చేశాడు. ఓ ప్రైవేటు కంపెనీలో ఆఫీసరుగా స్థిరపడ్డాడు. పెద్ద మొత్తంలో జీతం. రాఘవ ఉద్యోగం చూసి పెద్ద పెద్ద వాళ్ళెందరో పిల్లనిస్తామని పోటీపడ్డారు.ఆ పోటీలో రాఘవకి నీరజ నచ్చింది.

మాధవరావు, శ్యామల తాము నమ్మిన ఆదర్శానికి కట్టుబడి కట్నం వద్దన్నారు. అయితే మా పిల్లకి మేం ఇచ్చుకుంటాం అన్నారు వాళ్ళు. నీరజకి వాళ్ళేం ఇచ్చారో, వీళ్ళేం పుచ్చుకున్నారో రాఘవ ఏనాడూ తమతో అనలేదు. తెలుసుకోవాలని వీళ్ళూ అనుకోలేదు.

పెళ్ళికి ముందు రాఘవ నెలనెలా రెండు వేలు పంపేవాడు. ఎప్పట్లాగే తినీతినకా అప్పులు తీరుస్తూ వచ్చారు. అప్పుల విషయం చెబ్దామని శ్యామల చాలా సార్లు అంది. కాని, మాధవరావు ఒప్పుకోలేదు. "బిడ్డల్ని పెంచడం, చదువు చెప్పించడం తల్లిదండ్రుల బాధ్యత. వాడి నుంచి ఏదో ఆశించి మనం వాడిని పెంచేమా?" అనేవాడు.

పదేళ్ళ క్రితం ఇల్లు అమ్మేసినప్పుడు అద్దె ఇంట్లోకి మారారు. ఇక్ష్వాకుల నాటి పాతమట్టి కొంప. ఇల్లుగల వాళ్ళు పక్కనే డాబా కట్టుకుని దాంట్లోకి వెళ్ళిపోయారు. వాళ్ళు వెళ్ళిన కొన్నాళ్ళకి అవతలి పక్కంతా కూలిపోయింది. ఎప్పటికప్పుడు కర్రలు దుంగలు బోట్లు పెట్టి వీళ్ళు మాత్రం ఇవతలి పక్క ఉంటున్నారు. గోడమీద నుంచి కిందికి రూఫ్ దించిన ఓ గదీ వసారా. గచ్చు, గోడలు పెచ్చులూడిపోయి ఇల్లు గల వాళ్ళు రిపేరు చేయించక దీనావస్థలో ఉంది. వసారాలోనే వంట, భోజనాలు. పడిపోతుందేమో అనే భయంతో ఇల్లు గల వాళ్ళు చాలాసార్లు ఖాళీ చేసెయ్యమన్నారు. అంత తక్కువ అద్దెలో మరో ఇల్లు దొరక్క వీళ్ళు ఖాళీ చెయ్యలేదు. వర్షాకాలం వస్తే ఏ క్షణాన పైకప్పు కూలి నెత్తిన పడుతుందోననే భయంతో శ్యామలకి నిద్రపట్టేది కాదు.

"ఎలా రాసిపెట్టి ఉంటే అలా జరుగుతుంది. పడుకో పడుకో" అనేవాడు మాధవరావు.

పెళ్ళికి మూడు నిద్రలకని వచ్చిన రాఘవ, నీరజ ఒక్క రోజులోనే ప్రయాణమై వెళ్ళిపోయారు. 'సెలవు లేదు' అన్నాడు రాఘవ. ఆ వెళ్ళడం వెళ్ళడం మళ్ళీ ఎప్పుడూ రానేలేదు. మనవరాలు పుట్టినప్పుడు వీళ్ళే వెళ్ళి చూసొచ్చారు.

కరువు కాలం వచ్చి వ్యవసాయం చేసే ఓపికలేక ఉన్న రెండెకరాలూ అమ్మేశాడు మాధవరావు. ఇల్లు గల వాళ్ళనడిగి పెరట్లో ఆకుకూరలు, కాయగూరలు, పాదులూ పెట్టి కొట్లకి వేస్తున్నాడు.

కొడుకు తమని దగ్గరకి వచ్చెయ్యమంటాడని చాలా ఎదురు చూసింది శ్యామల.

అలా పిలవకపోగా నెలనెలా పంపే డబ్బుల్లో వెయ్యి కట్ చేశాడు. ఏదో లోన్ తీసుకోవాల్సి వచ్చిందని, టేక్స్ ఫ్రీ కోసం ఫ్లాటు కొన్నాననీ ఉత్తరం రాశాడు.

క్రితం సంవత్సరం మనవరాల్ని చూడాలని ఉందని శతపోరి శ్యామల హైదరాబాద్ ప్రయాణం పెట్టించింది.

రాఘవ స్టేషనుకి కారేసుకుని వచ్చాడు. "కారు బావుందా అమ్మా, మనదే. ఓ ఫ్రెండు ఫారిన్ నుంచి తెప్పించుకుని ఓ రెండేళ్ళు వాడేడంతే. అతనికి స్టేట్స్‌లో ఛాన్సొచ్చింది. అతను అమ్మేస్తుంటే అచ్చొచ్చిన కారని తీసుకున్నాను. చాలా తగ్గించి ఇచ్చేడులే" అని చెప్పుకుంటూ కారు నడుపుతున్నాడు రాఘవ.

"ఈ కారు నడపడం అదీ ఎప్పుడు నేర్చుకున్నావురా నాయనా" అంటూ ముచ్చటపడి పోయింది శ్యామల.

అయిదంతస్తుల బిల్డింగులో మొదటి అంతస్తులో ఉంది రాఘవ ఇల్లు. విశాలమైన రెండు పడక గదుల పోర్షను. ఆ ఇంటిని అలంకరించిన తీరుకి కన్ను చెదిరిపోయింది శ్యామలకి. వెంటనే తన దిష్టే తగిలేలా ఉందని మెటికలు విరుచుకుని తనని తానే తిట్టుకుంది.

బొద్దుగా పెరుగు బంతి పువ్వులా ఉన్న మనవరాల్ని చూసి తెగ మురిసిపోయింది. రమ్మని చేతులుచాపింది. అది వాళ్ళమ్మ ఒడిలోకి ముడుచుకుపోయింది.

"నేను నీ నాన్నమ్మనే లేవే, రా..." అని బలవంతంగా లాక్కోబోయింది.

"ముందు స్నానం చేసి రండి. దూర ప్రయాణం చేసిన బట్టలు కదా" అంది నీరజ.

స్నానాలు చేశాక వాళ్ళు కట్టుకున్న బట్టల్ని చూసి నీరజ రాఘవ వేపు చూసిన అర్థవంతమైన చూపు శ్యామల దృష్టిని దాటిపోలేదు. ఉతికి ఉతికి కావిరంగుకొచ్చేసిన తమ బట్టల పురాతన స్వరూపం ఆ ఇంట్లో కొట్టొచ్చినట్టు కన్పించింది. గుమ్మాల దగ్గరేసిన కాళ్ళు తుడుచుకునే పట్టాలు కూడా తమ బట్టలకన్నా ఎంతో బావున్నాయి. సాయం కాలం ఆఫీసు నుంచి వస్తూ రాఘవ తండ్రికి రెండు పంచెలు చొక్కాలు, తల్లికి నాలుగు జరీ చీరలు తెచ్చేడు.

"ఇక్కడున్నన్నాళ్ళూ ఇవే కట్టుకోండి" అన్నాడు. "ఇలా బైటికొచ్చినప్పుడు కాస్త మంచి బట్టలు తెచ్చుకోవచ్చు కదా" అంటున్న రాఘవ గొంతులోని విసుగు వాళ్ళ దృష్టిని

దాటిపోలేదు. "తాము ఏం తింటూ, ఏం కట్టుకుంటూ, ఎలా బతుకుతున్నారో వీడికి తెలీదా" అనుకుంది శ్యామల.

ఎంత పట్టిపట్టి చూసినా మాధవరావు మొహంలో నిర్లిప్తత తప్ప మరేం కనిపించలేదు శ్యామలకి.

'ఈ మగవాళ్ళ మనసు దేనికీ చలించనంతగా మొద్దుబారిపోయి ఉంటుంది కాబోలు' అని సణుక్కుంది శ్యామల.

స్టేషన్ నుంచి ఇంటికొచ్చేటప్పుడు రాఘవ ఏం మాట్లాడేడో గలగలా అంతే, ఇంటికొచ్చాక ఆ పలకరింపులే లేవు. మర్నాడు ఉదయం ఇంటి దగ్గిరి అలవాటు చొప్పున ఆరు గంటలకే మెలకువ వచ్చేసింది. ముఖాలు కడుక్కుని స్నానాలు కానిచ్చేరు. "కొంచెం కాఫీ కలపరాదూ" అన్నాడు మాధవరావు.

వంటింట్లోకి వెళ్ళిన శ్యామలకి ఏవెక్కడున్నాయో అర్థం కాలేదు. రాత్రి మిగిలిపోయిన అన్నం కూరలు స్టవ్ గట్టుమీద ఉన్నాయి. ఎక్కడా పంచదార, కాఫీపొడి కన్పించలేదు. గోడలకి అద్దాల తలుపుల అల్మైరాలున్నాయి. అన్నిటి తలుపులూ మూసేసి ఉన్నాయి. వాటిని ఎలా తెరవాలో శ్యామలకి అర్థం కాలేదు. మాధవరావు వచ్చి చూసి తాళాలు వేసి ఉన్నాయి అని చెప్పాడు.

"ఇక్కడ వంటింటి అల్మరాలకి కూడా తాళాలు వేసుకుంటారా, ఎందుకలాగ?" అని ఆశ్చర్యపోయింది శ్యామల. ఫ్రిజ్‌లో చూస్తే పాల పేకెట్లూ లేవు.

ఎనిమిది గంటల వేళప్పుడు ఇక ఆగలేక 'బైటికెళ్ళి కాఫీ తాగి వస్తాను" అని వెళ్ళిన మాధవరావు 'దరిదాపుల్లో ఎక్కడా హోటల్లాంటిదేం లేదు' అంటూ వెనక్కి తిరిగొచ్చాడు.

తొమ్మిది దాటేక రాఘవ వాళ్ళ గది తలుపు తెరుచుకుని బైటికొచ్చేడు. లిఫ్టు దగ్గిరున్న చిక్కం సంచిలోంచి పాలపేకెట్టు తెచ్చి గిన్నెలో పోసి స్టవ్‌మీద పెట్టేడు. ఆఫీసుకి కాబోలు గబగబా తయారవడం మొదలుపెట్టాడు. నీరజ, పాపాయి ఇంకా ముసుగులు తియ్యలేదు. "అదేవిట్రా, పాలు నువ్వు కాస్తున్నావు? నాతో చెప్తే నేను కాచనా" అంది శ్యామల. కొడుకు పలకరిస్తాడేమోనని కాబోలు ఆశగా ఎదురు చూస్తున్నాడు మాధవరావు.

శ్యామల ఇక ఆగలేక "రాఘవా! కాఫీపొడి, పంచదార ఎక్కడున్నాయిరా? మీ నాన్న గారు పొద్దుటే కాఫీ తాగకపోతే ఉండలేరు కదా" అంది.

రాఘవ కబోర్డ్‌లోంచి పంచదార డబ్బా తీస్తూ "కాఫీ పొడి లేనట్టుంది. నీరజా నేను కాఫీ టీలు తాగం. మీ కోసం సాయంకాలం వచ్చేటప్పుడు తెస్తాలే" అంటూ హడావుడిగా మూడు కప్పుల్లో పాలుపోసి పంచదార కలిపేడు. ట్రేలో పెట్టి తెచ్చి తండ్రికొక కప్పు ఇచ్చి, తనో కప్పు తీసుకున్నాడు.

"ఈ తలుపులు తియ్యి. నీకు ఆఫీసుకి టైమవుతున్నట్టుంది. త్వరగా కాస్త ఉప్మా అయినా చేస్తాను" అంది శ్యామల.

"వద్దమ్మా, నా టిఫిను, లంచ్ ఆఫీసులోనే. నీరజ లేచాక చేస్తుందిలే. ఈ లోపల ఇలా వచ్చి ఈ పాలు తాగు" అన్నాడు. "అన్నట్టు వంటింటి పనుల్లో నువ్వేం కల్పించుకోకేం. వంటిల్లు ఎవరికీ అప్పగించడం నీరజకి ఇష్టం ఉండదు". మనసు చివుక్కుమంది శ్యామలకి.

పది గంటలకి నీరజ లేచే సరికి కళ్ళు తిరిగినట్టయి ఇద్దరూ మంచాల మీద వాలిపోయేరు. నీరజ స్థిమితంగా టిఫిను చేసి తాపీగా వడ్డించింది.

"రంగమ్మా, అందరి బట్టలూ కలిపి ఉతక్కేం. ముందు మా బట్టలు ఆరబెట్టేసి, తర్వాత వాళ్ళిద్దరి బట్టలూ వేరుగా ఉతుకు" అని కోడలు పనిమనిషితో అనడం వింది శ్యామల. కోడలే ఇవ్వని విలువ తనెందుకివ్వాలనుకున్నట్టుంది రంగమ్మ వీళ్ళ బట్టలు ఉతక్కుండా వదిలేసి వెళ్ళిపోయింది. -

"మీ మావగారు ఆకలికి ఆగలేక పోతున్నారు. ఏం చెయ్యాలో చెప్తే నువ్వు లేచేసరికి నేను టిఫిను తయారు చేసేస్తూంటాను" అంది శ్యామల మర్నాడు.

బాత్‌రూంలో పాపాయికి స్నానం చేయిస్తున్న నీరజ ఉన్నట్టుండి పాపాయి వీపు ఛెళ్ళుమన్పించింది. శ్యామల గుండె చెరువయ్యింది.

మాధవరావు వ్యవసాయం మానేసినప్పట్నుంచి మధ్యాహ్నం పన్నెండు కల్లా భోజనాలు కానిచ్చేసి కాస్సేపు నడుం వాల్చడం అలవాటైంది ఇద్దరికీ. ఇక్కడ నీరజ రెండు దాటితేగాని కుక్కరు పెట్టదు. రాత్రి భోజనాలు పదకొండుకి, పన్నెండుకీ.

అన్నిటికన్నా ముఖ్యంగా రాఘవ తీరు చాలా బాధిస్తోంది. "అమ్మా, అమ్మా" అంటూ కొంగు పట్టుకు తిరిగిన ఆ రాఘవేనా వీడు అనిపిస్తోంది. తమ వేపు చూడడు, ఆప్యాయంగా పలకరించడు.

పొమ్మనలేక పొగపెడుతున్న తీరుగా ఉంది.

'మీరింకా అక్కడెందుకు, ఇక్కడికి వచ్చెయ్యండి' అంటాడేమోననే ఆశ అడుగంటింది.

ఒకవేళ రమ్మంటే మాత్రం ఈ ఇంట్లో తాము ఉండగలరా? వేళకింత తిండి వండుకుని తినలేకా తామిక్కడికి వచ్చింది?

ఓ రోజు స్నేహితురాలెవరితోనో ఫోన్లో మాట్లాడుతూ నీరజ "అబ్బా! వడ్డాణంతో సహా అన్నీ ఉన్నాయే. నా దగ్గరలేని కొత్త నగలేమైనా షాపులో ఉంటేచెప్పు, వస్తాను" అంటోంది.

పోనీ పాపాయికి కొనడానికి రమ్మన్నట్టుంది అవతలి నుంచి స్నేహితురాలు.

పాపాయికి వాళ్ళ అమ్మమ్మ గారు ఏమేం ఇచ్చారో చాలా సేపు చెప్పింది నీరజ. చివరికి "కొందరు మా దగ్గర పుచ్చుకునే వాళ్ళే గాని చంటిపిల్లకి ఏమైనా ఇవ్వాలని అనుకోరు" అంది.

అది తమని ఉద్దేశించేనని అర్థమై శ్యామలకి కళ్ళల్లో నీళ్ళూరేయి. ఈ ఇల్లు కాక మరో ఫ్లాటు కొనాలనుకుంటున్నాడట రాఘవ. 'లేకపోతే అంతా టాక్స్ కింద పోతుంది కదా' అంటోంది నీరజ.

ఎందుకింత డబ్బు మనుషులైపోయారు వీళ్ళు? ఈ నాటి చదువుల పర్యవసానం ఇదేనా? కేవలం డబ్బేనా. మమతలు - మమకారాలు ఏవీ అక్కర్లేదా? మనవరాల్ని ఎత్తుకోవాలని, ముద్దుచెయ్యాలని ప్రాణం ఒకటే కొట్టుకులాడుతోంది. కాని, రెండేళ్ళ ఆ పసిపిల్లకి తామెవరో తెలీదే!

అతి కష్టం మీద ఓ పది రోజులు గడిచాయి.

ఆ జైల్లో ఉండడం ఇక తమ వల్ల కాదనిపించింది. కలో గంజో కలిగిన కాడికి కాచుకు తాగిందే అమృతం. ఇక్కడ వీళ్ళు బంగారం ముద్దలు తప్ప నిజమైన తిండి తినడం లేదు.

ఇది తమ కొడుకు ఇల్లనీ, తమకీ స్వతంత్రం ఉందనీ అనిపించడం లేదెందుకో.

శ్యామలకి తన పెళ్ళైన కొత్త రోజులు గుర్తుకొచ్చాయి. అత్తగారి పెత్తనం, నలుగురు ఆడబిడ్డలు వాళ్ళ పెళ్ళిళ్ళు - రాఘవ పుట్టాక అత్తగారు తనని ఆప్యాయంగా చూడడం, పెద్ద వయసులో అత్తగారిని పసిపిల్లలాగా చూసుకోవడం తన బాధ్యతగా భావించడం-

అదంతా గతించిపోయిన కాలం.

బహుశా నీరజకి ఇది తన సామ్రాజ్యం, తన భర్త అతని సంపాదన తన సొంతం, ఇందులో మరెవరికీ చోటుండకూడదు అనే భావమేదో గాఢంగా ఉంది. తను ఏ కొంచెం మెత్తబడినా ఈ సొంతం చెయి జారిపోతుందనిపిస్తున్నట్టుంది.

మగ పిల్లలకి పెళ్ళయ్యాక తల్లిమీద ప్రేమ భార్య మీదికి మళ్ళుతుందంటారు. మళ్ళనీ, అది సహజమే. కాని, రాఘవ తమ నెందుకింత దూరం పెడుతున్నాడు? నీరజకి భయపడుతున్నాడా?

ఈ వయసులో తమకేం కావాలి? కొడుకు, కోడలు, మనవల మధ్య ఈ తనువులు వెళ్ళిపోవాలని కోరుకుంటాం. వాళ్ళ విలాసాలకీ, సుఖానికీ అడ్డుగా ఉండాలని అనుకోవడం లేదు. అయినా తమ ఉనికే వాళ్ళకి కంటకంగా ఉంది.

వెళ్ళే రోజున ఎంత ఆపుకొన్నా ఆగకుండా శ్యామల కళ్ళు వర్షిస్తూనే ఉన్నాయి.

ఎందుకనాలనిపించిందో గాని ట్రెయినెక్కే ముందు "రాఘవా! చిన్నదో చితకదో మన ఊళ్ళో మా నెత్తి మీదికింత నీడను ఏర్పరచరా" అని మాత్రం అనగలిగింది.

ఆర్నెల్ల తర్వాత రాఘవకి ఏమనిపించిందో తెలీదు. హఠాత్తుగా డబ్బుతో ఊడిపడ్డాడు. కాస్త రేటు ఎక్కువైనా మంచి కాలనీలో రెండు వందల చదరపు గజాల స్థలం కొన్నాడు.

అప్పటికప్పుడు ప్లాన్ గీయించి, పంచాయతీ ఆఫీసులో ఓకే చేయించి, శంకుస్థాపన రోజు కొబ్బరికాయ కొట్టేసి వెళ్ళిపోయాడు.

దిగితేగాని లోతు తెలీనట్టు ఇల్లు కట్టించడంలో ఇంత కష్టం ఉందని మొదలుపెట్టేక తెలిసింది మాధవరావుకి.

పూర్వీకులు ఇచ్చి పోయిన ఇంటినీ, కొంచ్రనీ అమ్మినప్పుడు తమ బిడ్డ భవిష్యత్తు కోసమే కదా అనే ఓ ధీమాతో చేశాడు. ఇప్పుడు కొడుకు పేరున ఈ ఇల్లు కట్టించడం తమ కొడుకు ప్రయోజకత్వం నలుగురికీ తెలుస్తోందనే చిరుగర్వంతో చేశాడు.

"పీటల మీద మీరే కూర్చుని గృహ ప్రవేశం చెయ్యండి" అని కొడుకు అన్నప్పుడు ఆనందంతో మురిసిపోయారు శ్యామల, మాధవరావు.

"అమ్మా, ఇంక మీరు లేవచ్చు" అంటున్నాడు పంతులుగారు.

శ్యామల ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చింది.

బైట షామియానాలో భోజనాల ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఊళ్ళో పిల్చిన వాళ్ళంతా వచ్చేరు. డాక్టర్లు, ఊరిపెద్దలు పేరుమోసిన వాళ్ళెందరో వచ్చారు.

ఇంటి చుట్టూ మామిడి చెట్లు ఉన్నాయి. వచ్చిన వాళ్ళందరికీ ఆ చెట్లకింద కుర్చీలు వేశారు.

ఈ ఇల్లు కట్టడం ప్రారంభించాక రాఘవ ఏమిటో అందరికీ తెలిసింది. పిలుపులకి వెళ్ళినప్పుడు చాలా మంది "శ్యామలా, అలాంటి కొడుకుని కన్నందుకు నువ్వు అదృష్టవంతురాలివి" అన్నారు. ఓ పక్క కొడుక్కి దిష్టితగులుతుందేమోనని భయంగా ఉన్నా కొడుకు ప్రయోజకత్వానికి గర్వంగా ఉంది.

రాత్రి నుంచి ఉపవాసం. భలే నీరసంగా ఉంది. వంటలయ్యే చోటి కెళ్ళి రెండు గ్లాసుల్లో కాఫీ తెచ్చి ఓ గ్లాసు మాధవరావుకిచ్చింది. తన గ్లాసు తీసుకుని నొప్పెడుతోన్న నడుముని సవరించుకుంటూ వాకిట్లో ఆడవాళ్ళంతా కూర్చున్న చోటికొచ్చింది శ్యామల. మామిడి చెట్టుకవతల నీరజ పుట్టింటి వాళ్ళంతా ఉన్నారు.

మామిడి చెట్లు పూతమీదున్నాయి. మాఘమాసపు నులివెచ్చని గాలి వీవనల్తో విసురుతున్నట్లు వీస్తోంది. మామిడి పూత వగరు సుగంధం నాసికను తాకుతూంటే ప్రాణానికి హాయిగా ఉంది.

తినకపోయినా కడుపు నిండినట్టుగా ఉంది.

"ఇల్లు పెద్దవాళ్ళ పేరుతో కట్టించేరా, పీటల మీద వాళ్ళు కూర్చున్నారు?" అంటోందొకావిడ.

"చాల్లే, వీళ్ళిలాంటి వాళ్ళే తెల్సా, పెద్దలిచ్చిన ఇల్లు పొలం అమ్మకు తినేశారు. అందుకే రాఘవ ఏం కొన్నా నా పేరుతోనే కొంటాడు. సడన్‌గా నేను ఇంట్లోకి రాకూడదైంది. అందుకే వాళ్ళచేత పూజ చేయించాం" అంటోంది నీరజ.

"అవునా, వచ్చివచ్చి ఈ పల్లెటూళ్ళో కట్టేరేమిటమ్మాయ్ ఇల్లు?" నీరజ మేనత్త ఒకావిడ అడుగుతోంది.

"ఏం చెయ్యమంటావత్తా! కంప్యూటర్స్ వాళ్ళకి అంతంత జీతాల్తో పెద్ద చిక్కొచ్చి పడింది. అప్పు చూపించకపోతే టాక్స్ కింద చాలా డబ్బు గవర్నమెంటుకి పోతుంది. ఈ వూళ్ళో తను ఎంతో హీనస్థితిలో పెరిగాడని రాఘవ ఎప్పుడూ గిల్టీఫీలవుతూంటాడు. ఆ గిల్టీనెస్ పోగొట్టుకోడానికి ఇక్కడ ఇల్లు కట్టేడు".

"పోన్లేమ్మా, మంచి పని చేశాడు. మీ అత్త మామలిద్దరికీ ఇప్పటికైనా కాస్త మంచి ఇంట్లో ఉండే అవకాశం చిక్కింది".

నీరజ పెద్దగా నవ్వింది. "అయ్యో అత్తా, ఈ ముసలి వయసులో వాళ్ళకెందుకింత పెద్ద ఇల్లు? ఈ ఇల్లు కడుతున్నప్పుడే హైవే కాంట్రాక్టర్లు హైదరాబాద్ వచ్చి పది నెలల అడ్వాన్స్ ఇచ్చేశారు. నెలకి మూడు వేలు రెంటు. ఇవాళ సాయంకాలమే వచ్చి దిగిపోతున్నారు వాళ్ళు".

శ్యామల కళ్ళ ముందు విస్ఫోటనం జరిగినట్టనిపించింది. నెత్తిమీద ఎవరో ఓ బండరాయిని పడేసినట్టయింది.

సొంత ఇంటి కల కళ్ళ ముందే కరిగిపోతున్నట్టయింది.

శరీరంలోంచి సత్తువనంతా ఎవరో పాశం వేసి లాగేస్తున్నట్టుంది. నిలబడలేక మామిడి చెట్టు కాండానికి చెయ్యి ఆన్చి నిలదొక్కుకోబోయింది.

కాండం మీదికి పాకుతున్న గండు చీమలు తమ సహజ నైజాన్ని చూపిస్తూ శ్యామల చేతిని కుట్టడం మొదలుపెట్టాయి.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 2 అక్టోబరు, 2005*